సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
ఆదివారం । 21 । సెప్టెంబర్ । 2025



టన్ను చీనీ రూ.16 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.16 వేలు, కనిష్టంగా రూ.8 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.22

కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.22, కనిష్టంగా రూ.14 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 2,250 టన్నుల టమాట వచ్చింది.

గరిష్టం/కనిష్టం
34.8°/20.6°

జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో పశ్చిమ దిశగా గాలి వీచింది.

పంటకు పవర్ లేదు

☛ గాండ్లపెంట మండలానికి చెందిన ఓ రైతు తన బోరు బావికి కరెంటు కనెక్షన్ కావాలని ఆరు నెలల క్రితం విద్యుత్ అధికారులకు దరఖాస్తు చేసుకున్నాడు. డీడీ కూడా దరఖాస్తుతో పాటే అందించాడు. కనెక్షన్ ఇస్తే సాగునీరుకు ఇబ్బంది ఉండదని, తద్వారా దిగుబడికి ఎలాంటి ఢోకా ఉండదని భావించాడు. కానీ విద్యుత్ శాఖ అధికారులు పెద్దగా పట్టించుకోలేదు. దీంతో ఆరు నెలలుగా కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నాడు.

☛ కొత్తచెరువు మండలానికి చెందిన ఓ రైతు వ్యవసాయ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. సంబంధిత అధికారులు దరఖాస్తును పరిశీలించి రైతు చెల్లించాల్సిన డబ్బులెంతో చెప్పేందుకు ఎస్టిమేషన్ (అంచనా) వేయాల్సి ఉంది. కానీ 4 నెలలుగా ఎస్టిమేషన్‌కు నోచుకోలేదు. దీంతో సదరు రైతు విద్యుత్ శాఖ అధికారుల చుట్టూ చెప్పులరిగిపోయేలా తిరుగుతూనే ఉన్నాడు.

.. ఇలా ఒకరు, ఇద్దరు కాదు. జిల్లా వ్యాప్తంగా 30 వేల మందికిపైగా రైతులు వ్యవసాయ కనెక్షన్ల కోసం విద్యుత్‌శాఖ కార్యాలయాల చుట్టూ నెలల తరబడి తిరుగుతున్నారు. అన్నదాతలకు అండగా ఉంటామన్న కూటమి నాయకుల మాటలు నీటి మూటలుగా మారగా...సాగునీటికోసం రైతులు పడరానిపాట్లు పడుతున్నారు.

రైతును కరుణించని కరెంటోళ్లు

- వ్యవసాయ సర్వీసుల మంజూరులో తీవ్ర నిర్లక్ష్యం
- డీడీలు చెల్లించి ఏళ్లుగా ఎదురుచూస్తున్న రైతులు
- నేటికీ పెండింగ్‌లోనే 30 వేలకుపైగా దరఖాస్తులు
- నీరున్నా పంటలకు పెట్టుకోని దుస్థితిలో అన్నదాతలు

కదిరి: కొత్తగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ పొందడం జిల్లాలో గగనమైపోయింది. దరఖాస్తు చేసుకొని ఏడాది దాటుతున్నా కరెంటు అధికారులు కరుణించడం లేదు. కూటమి సర్కారుకూ రైతుల గోడు పట్టడం లేదు. దీంతో బోర్లలో నీరున్నా పంటకు పారించుకోలేక చాలా మంది రైతులు పొలాలను బీళ్లుగా వదిలేశారు.

31,327 వ్యవసాయ కనెక్షన్ల కోసం అందిన దరఖాస్తులు	22,848 ఎస్టిమేషన్‌కు కూడా నోచుకోని దరఖాస్తులు
8,479 డీడీలు చెల్లించిన రైతులు	రూ 10.17 కోట్లు రైతులు చెల్లించిన నగదు

ఏడాదిగా ఎదురుచూపులు..

జిల్లాలోని 31,327 మంది రైతులు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 8,479 మంది రైతులు రూ.10.17 కోట్ల మేర డీడీలు కూడా తీసి సమర్పించారు. ఈ తంతు ముగిసి ఏడాది కావస్తున్నా... ఇంత వరకూ విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. డబ్బు చెల్లించిన వారి పరిస్థితి ఇలా ఉంటే... ఎస్టిమేషన్‌కు కూడా నోచుకోని దరఖాస్తులు ఇంకా 22,848 ఉన్నాయి.

తప్పిన ప్రాధాన్యతా క్రమం..

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం అందిన దరఖాస్తులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి సీనియారిటీ ప్రకారం ఎస్టిమేషన్ వేసి ఇవ్వాల్సి ఉంటుంది. అనంతరం డీడీలు చెల్లించిన రైతులకు ప్రాధాన్యతా క్రమం ప్రకారం కనెక్షన్ ఇవ్వాలి. పౌరసేవల పట్టిక ప్రకారం దరఖాస్తు చేసుకున్న రెండు రోజుల్లోనే అధికారులు రైతులకు ఎస్టిమేషన్ వేసి ఇవ్వాల్సి ఉంది. డీడీలు చెల్లించిన వెంటనే కనెక్షన్ ఇవ్వాలనే నిబంధనలున్నాయి. కానీ జిల్లాలో ఎక్కడా ఈ నిబంధనలు పాటించలేదు. సిఫారసులు, పైరవీలతో పాటు ముడుపులు ముట్టజెబితే గానీ కరెంటు కనెక్షన్ మంజూరు చేయని పరిస్థితి కనపడుతోంది. సాధారణ రైతులు నెలల తరబడి కరెంటు సర్వీసు కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. కరెంటు కనెక్షన్‌తో పాటు ట్రాన్స్‌ఫార్మర్ కూడా ఏర్పాటు చేయాల్సి వస్తే డీడీ రూపంలో ప్రభుత్వానికి చెల్లించిన డబ్బుతో సంబంధం లేకుండా రూ.లక్షల్లో ముడుపులు చెల్లించాల్సి వస్తోందని రైతులు ఆరోపిస్తున్నారు. కూటమి నేతల ఆశీర్వాదాలున్న వారికి మాత్రం రోజుల వ్యవధిలోనే కనెక్షన్లు మంజూరవుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు.

అందుబాటులో ఉండని అధికారులు..

మండల, నియోజకవర్గ కేంద్రాలతో పాటు జిల్లా కేంద్రంలోనూ విద్యుత్ శాఖ అధికారులు అందుబాటులో లేరనే విమర్శలున్నాయి. ఆయా డివిజన్ల పరిధిలో డీఈల పర్యవేక్షణలో ఏడీఈలు, ఏఈలు పని చేస్తుంటారు. ఉన్నత స్థాయి నుంచి హెల్పర్ స్థాయి వరకూ ఒకరినొకరు సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు విద్యుత్ సమస్యలు పరిష్కరించాల్సి ఉంది. కానీ ఎక్కడా అలా జరగలేదు. విద్యుత్‌శాఖ అధికారులు నియమించుకున్న ప్రైవేటు సిబ్బందే స్తంభాలు ఎక్కి పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రాణాలు కూడా పోగొట్టుకున్న సంఘటనలు జిల్లాలో ఉన్నాయి. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు వ్యవసాయ కనెక్షన్లు, పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరుపై దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.



జగన్ హయాంలో అడిగిన వెంటనే కనెక్షన్



జగనన్న ప్రభుత్వం రైతులకు అడిగిన వెంటనే కరెంటు కనెక్షన్ ఇచ్చింది. అలాగే ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ ఉపకరణాలు, సాగుకు పెట్టుబడి, గిట్టుబాటు ధర అందించి రైతులకు అండగా నిలిచింది. కానీ కూటమి ప్రభుత్వంలో ముడుపులు ముట్టజెబితే గానీ కరెంటు కనెక్షన్ ఇవ్వడం లేదు. అది కూడా కూటమి నేతలు చెబితేనే ఇస్తున్నారు. సామాన్య రైతులు ఏడాదిగా ఎదురు చూస్తున్నారు.
– ఉషశ్రీచరణ్, జిల్లా అధ్యక్షురాలు, వైఎస్సార్ సీపీ

సీనియారిటీ ప్రకారం సర్వీసులిస్తాం



సీనియారిటీ ప్రకారం దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ వ్యవసాయ విద్యుత్ సర్వీసులిస్తాం. వ్యవసాయ కనెక్షన్లకు డిమాండ్ ఎక్కువగా ఉంది. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నీ త్వరలోనే పరిష్కారమయ్యేలా చూస్తాం. కనెక్షన్ కోసం రైతులెవ్వరూ లంచం ఇవ్వాల్సిన అవసరం లేదు. అలాగే విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండేలా తగు చర్యలు తీసుకుంటాం.
– సంపత్‌కుమార్, విద్యుత్ ఎస్‌ఈ

న్యూస్‌రీల్

45 రోజుల్లోపు పీ-4 కుటుంబాలను గుర్తించాలి

- సచివాలయ ఉద్యోగులకు కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యాం ప్రసాద్

పుట్టపర్తి టౌన్: పీ–4 కార్యక్రమంలో భాగంగా 45 రోజుల్లోపు బంగారు కుటుంబాలను గుర్తించాలని కలెక్టర్ శ్యాం ప్రసాద్ అధికారులను ఆదేశించారు. 'స్వర్ణాంధ్ర–2047' అమలుపై శనివారం స్థానిక సాయి ఆరామంలో గ్రామ/వార్డు సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కలెక్టర్ శ్యాం ప్రసాద్‌తో పాటు రాష్ట్ర స్థాయి అధికారులు సందీప్, రాజశేఖర్ తదితరులు పాల్గొని పీ–4 కార్యక్రమం అమలుపై దిశానిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... పీ–4 కార్యక్రమం ద్వారా సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించేందుకు వీలు కలుగుతుందన్నారు. ఇందుకు బంగారు కుటుంబాలు ఉపయోగపడతాయన్నారు. పీ–4 కుటుంబాల ఎంపికలో గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులు మూల స్తంభాలన్నారు. కార్యక్రమంలో సీపీఓ విజయకుమార్, గ్రామ/వార్డు సచివాలయ సిబ్బంది, మాస్టర్ ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

సాయిూ.. సర్వమూ నీవేనోయిూ



సంగీత కచేరీ నిర్వహిస్తున్న ఏలూరు సత్యసాయి భక్తులు

ప్రశాంతి నిలయం: 'సాయీ..సర్వమూనీవేనోయీ' అంటూ ఏలూరు జిల్లా సత్యసాయి భక్తులు సంగీత కచేరీ నిర్వహించారు. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన ఏలూరు సత్యసాయి భక్తులు శనివారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత సంగీత కచేరీ నిర్వహించారు. సత్యసాయిని కీర్తిస్తూ.. వారు చేసిన కచేరీతో సాయికుల్వంత్ సభా మందిరం మార్మోగింది.

ఈ-క్రాప్ నమోదు నెలాఖరులోపు పూర్తి చేయాలి

- అధికారులకు జేసీ ఆదేశం



రెడ్డిపల్లిలోని ఫర్టిలైజర్ షాపులో రికార్డులు పరిశీలిస్తున్న జేసీ అభిషేక్ కుమార్

నల్లమాడ: ఖరీఫ్‌లో రైతులు సాగుచేసిన పంటల వివరాలను నెలాఖరులోపు ఈ–క్రాప్‌లో నమోదు చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ వ్యవసాయ శాఖ సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆయన మండలంలో పర్యటించారు. నల్లమాడ, రెడ్డిపల్లిలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. అందుబాటులో ఉన్న ఎరువులు, క్రిమి సంహారక మందుల వివరాలను బోర్డులో ప్రదర్శించాలన్నారు. అనంతరం నల్లమాడలోని ఎరువుల గోడౌన్‌ను పరిశీలించారు. ఇప్పటివరకు మండలానికి ఎంతమేర యూరియా సరఫరా అయ్యిందని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన సానేవారిపల్లిలో రైతు పాపిరెడ్డి పొలంలో జరుగుతున్న ఈ– క్రాప్ నమోదు ప్రక్రియను పరిశీలించారు.

జిల్లా జడ్జి, డీఐజీని కలిసిన ఎస్పీ



జిల్లా జడ్జి భీమారావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

పుట్టపర్తి టౌన్: జిల్లా ఎస్పీగా ఇటీవలే బాధ్యతలు తీసుకున్న సతీష్‌కుమార్ శనివారం ఉమ్మడి అనంతపురం జిల్లా జడ్జి భీమారావు, అనంతపురం రేంజ్ డీఐజీ డాక్టర్ షిమోషీని అనంతపురంలో వారి కార్యాలయాల్లో మార్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో నెలకొన్న శాంతిభద్రతల సమస్యలపై చర్చించారు. అలాగే ప్రశాంతి నిలయంలో సత్యసాయి సెంట్రల్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జే రత్నాకర్‌ను కూడా ఎస్పీ సతీష్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు.

జల్నా-తిరుచానూరు మధ్య ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు: ప్రయాణికుల రద్దీ దృష్టిలో ఉంచుకొని జల్నా–తిరుచానూరు–జల్నా మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుపుతున్నట్లు సీనియర్ డీసీఎం మనోజ్ శనివారం మీడియాకు తెలిపారు. జల్నా జంక్షన్‌లో ఈ నెల 21 (ఆదివారం) నుంచి అక్టోబర్ 26 వరకు వీక్లీ ఎక్స్‌ప్రెస్(07601)గా (6 సర్వీసులు) మాత్రమే నడుపుతున్నట్లు వెల్లడించారు. తిరుగు ప్రయాణంలో తిరుచానూరు రైల్వేస్టేషన్ నుంచి ఈ నెల 22 (సోమవారం) నుంచి అక్టోబర్ 27 వరకు వీక్లీ ఎక్స్‌ప్రెస్ (07602)గా (6 సర్వీసులు) నడుపుతున్నట్లు వివరించారు. ఈ రైళ్లు రాయలసీమ జిల్లాలోని మంత్రాలయం రోడ్డు, ఆదోని, గుంతకల్లు, అనంతపురం. ధర్మవరం, కదిరి, మదనపల్లి, పీలేరు, పాకాల, తిరుపతి జంక్షన్ల మీదుగా రాకపోకలు సాగిస్తున్నట్లు చెప్పారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈద్గా కూల్చి.. షాదీ మహల్ పూడ్చి..



గుట్టపై ఉన్న ఈద్గా శిథిలాలు



పూడ్చి వేస్తున్న షాదీమహల్ భవనం

- పెడపల్లిలో కూటమి నేతల భూ దందా
- ప్రార్థనా స్థలాలపై కన్నేసి కాజేసేందుకు యత్నం
- తీవ్ర అభ్యంతరం తెలుపుతున్న ముస్లింలు

పుట్టపర్తి అర్బన్: రాష్ట్రంలో కూటమి సర్కార్ కొలువుదీరాక ఆ పార్టీ నాయకుల ఆగడాలకు, దౌర్జన్యాలకు అంతేలేకుండా పోయింది. ఖాళీ భూమి కనిపిస్తే చాలు కబ్జా చేసి దర్జాగా విక్రయించుకుంటున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే భౌతిక దాడులకూ సిద్ధమవుతున్నారు. చివరకు ప్రార్థనా స్థలాలను సైతం సొంతం చేసుకునేందుకు సిద్ధమయ్యారు. పెడపల్లిలో కూటమి నేతల చర్యలతో ఈద్గా, షాదీ మహల్ రూపురేఖలు కోల్పోయాయి. కనీసం ప్రార్థనలకూ అవకాశం లేకపోవడంతో ముస్లింలు మండిపడుతున్నారు.

జాతీయ రహదారి ఏర్పాటుతో..

పుట్టపర్తి మండలం పెడపల్లి మీదుగా 342 జాతీయ రహదారి ఏర్పాటవుతోంది. దీంతో సమీపంలోనే ఉన్న సర్వే నంబర్ 139లోని ఈద్గా, షాదీ మహల్ స్థలాల విలువ భారీగా పెరిగింది. ఈ క్రమంలోనే ఎన్‌హెచ్–342 కోసం అధికారులు సేకరించగా మిగిలిన 54 సెంట్ల ఈద్గా భూమిపై కన్నేశారు. ఈ భూమిని చదును చేసి నూతన ఈద్గా నిర్మిస్తామని మత పెద్దలకు చెప్పారు. ఇందుకు గాను సగం భూమి ఇవ్వాలని బేరం పెట్టారు. లేకపోతే మొత్తం లాగేసుకుంటామని బెదిరించారు. ఆ వెంటనే స్థలంలోని రాళ్లు, మట్టిని ఓ నాయకుడి పొలానికి తరలించారు. ఈ చర్యలపై ముస్లింలు అభ్యంతరం తెలిపారు. కూటమి నేతల దుర్మార్గాన్ని కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్‌కు విన్నవించారు. దీంతో ప్రస్తుతానికి పనులు నిలిపివేశారు. గుట్టలోని ఖాళీ స్థలంలోనే ప్రస్తుతం ముస్లింలు ప్రార్థనలు చేసుకుంటున్నారు.

షాదీమహల్ స్థలం కొట్టేసే యత్నం..

ప్రస్తుతం ఎన్‌హెచ్ –342కు పడమర వైపు ఉన్న షాదీ మహల్‌ను 10 ఏళ్ల క్రితం నిర్మించారు. అయితే ఇప్పటికీ దాన్ని ప్రారంభించలేదు. దీంతో రూ.45 లక్షలతో నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరింది. ఈ నేపథ్యంలో కొందరు కూటమి నాయకులు... షాదీ మహల్ పక్కనే ఉన్న రూ.కోటి విలువ చేసే అర ఎకరా భూమిని ఆక్రమించేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలోనే షాదీ మహల్ పక్కనే ఉన్న స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. త్వరలోనే మిగతా స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్న షాదీమహల్‌ను కూల్చి వేస్తే రూ. కోటి విలువైన భూమి అన్యాక్రాంతమవుతుంది. అధికారులు స్పందించి భూకబ్జాకు యత్నిస్తున్న కూటమి నాయకులపై చర్యలు తీసుకోవాలని పలువురు ముస్లింలు కోరుతున్నారు.

దసరా సెలవులొచ్చాయోచ్!



సెలవులు రావటంతో కేరింతలు కొడుతున్న పుట్టపర్తి శివాలయం వీధి పాఠశాల విద్యార్థులు

పుట్టపర్తి: పాఠశాలలకు ఈనెల 22 వతేదీ (సోమవారం) నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు దసరా సెలవులు ఇస్తున్నట్లు డీఈఓ కృష్ణప్ప తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 12 రోజుల దసరా సెలవుల అనంతరం అక్టోబర్ 3వ తేదీ పాఠశాలలు పునఃప్రారంభమవుతాయన్నారు. సెలవురోజుల్లో ఏ పాఠశాలలోనూ తరగతులు నిర్వహించకూడదన్నారు. నిబంధనలు ఉల్లంఘించే పాఠశాలలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇక పాఠశాలలకు సెలవులు రావడంతో విద్యార్థులు ఉల్లాసంగా, సంతోషంగా ఇళ్లకు చేరుకున్నారు. వసతి గృహాలు, గురుకుల పాఠశాల విద్యార్థులు సొంతూళ్లకు వెళ్లారు.



సంతోషంగా స్వగ్రామాలకు వెళ్తున్న పుట్టపర్తి ఎస్సీ హాస్టల్ విద్యార్థినులు

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో కార్మికునికి షాక్

రాప్తాడు: విద్యుత అధికారుల నిర్లక్ష్యంతో ప్రైవేట్ కార్మికుడు విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. హంపాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 33 కేవీ ఫిట్టింగ్ పనులు జరుగుతున్నాయి. రాప్తాడు సమీపంలో ఉంటున్న గోపాల్ అనే కాంట్రాక్టర్ తన కూలీలలో ఈ పనులు చేయిస్తున్నాడు. సబ్‌స్టేషన్‌లో ఎల్‌సీ తీసుకున్నామని విద్యుత్ అధికారులు చెప్పడంతో పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఎస్‌కే బైసి అనే కార్మికుడు శనివారం సాయంత్రం ఎస్‌వీఐటీ కళాశాల వెనుక వైపు 11 కేవీ పోల్ మీద కూర్చొని జంపర్‌కు కనెక్షన్ ఇస్తున్నాడు. ఇంతలో సబ్‌స్టేషన్ సిబ్బంది విద్యుత్‌ను సరఫరా చేయడంతో పోలు మీద ఉన్న ఎస్‌కే బైసి షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతన్ని అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించారు. విద్యుత్ శాఖ మండల ఏఈ శివప్రసాద్ నాయుడు ఆధ్వర్యంలో ఎల్‌సీ తీసుకుని పనులు చేయించాల్సి ఉంది. అయితే ఏఈ నిర్లక్ష్యం వల్ల ఆయన ఎల్‌సీ తీసుకోకుండా కింది స్థాయి సిబ్బందికి చెప్పడంతో ఎస్‌కే బైసి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఏఈ నిర్లక్ష్యం కారణంగానే కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం బాధితుని పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించినట్లు సమాచారం. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి వేధింపులు

- కేసుల మీద కేసులు పెట్టి వేధిస్తున్న ప్రభుత్వం
- తాజాగా మరోసారి రిమాండుకు

కదిరి టౌన్: వైఎస్సార్‌సీపీ ప్రచార కమిటీ కదిరి అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు మెగా అంజాద్‌పై కూటమి సర్కారు వేధింపులు కొనసాగుతున్నాయి. వరుసగా అక్రమ కేసులు బనాయిస్తూ ఇబ్బందులకు గురిచేస్తోంది. ఈ క్రమంలోనే ప్రభుత్వ ఆదేశాల మేరకు రెడ్‌బుక్ 2.0 అమల్లో భాగంగా ఆయన్ను పోలీసులు మరోసారి అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. మెగా అంజాద్ వైఎస్సార్‌సీపీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. దీన్ని జీర్ణించుకోలేని టీడీపీ నాయకులు కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అంజాద్‌ను అరెస్టు చేసి జైలుకు పంపారు. సుమారు నెల రోజులు రిమాండ్‌లో ఉన్నారు. అనంతరం కొద్ది రోజులకు భార్య పేరిట భూమి కబ్జా చేశాడని పోలీసులకు టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. దీంతో మరోసారి తప్పుడు కేసు నమోదు చేశారు. ఆ తర్వాత కదిరిలోని రాయలసీమ సర్కిల్‌లో తన రెడీమేడ్ దుస్తుల దుకాణంలో ఉండగా మెగా అంజాద్‌పై కొందరు టీడీపీ నాయకులు దాడి చేసి గాయపరిచారు. దీనిపై ఆయన పట్టణ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అయితే..పోలీసులు దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయకుండా.. దెబ్బలు తిన్న అంజాద్‌పై కేసు కట్టి సబ్ జైలుకు తరలించారు.



మెగా అంజాద్

తాజాగా మరో కేసు

తాజాగా ప్రభుత్వానికి, మంత్రి లోకేష్‌కు వ్యతిరేకంగా అంజాద్ ఫేస్‌బుక్ ఐడీపై పోస్టు వచ్చిందని, కావున ఆయన్ను అరెస్టు చేసి జైలుకు పంపాలని ఐజీ కార్యాలయం నుంచి స్థానిక పోలీసులకు ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో డీఎస్పీ వెంకట శివనారాయణస్వామి ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఆయన్ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. రెడ్‌బుక్ 2.0లో ఇది మొదటి కేసు అని స్వయాన పోలీసులే వ్యాఖ్యానిస్తుండడం గమనార్హం. తన భర్తపై కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని అంజాద్ భార్య కన్నీరుమున్నీరు అవుతోంది.

క్లుప్తంగా

29 నుంచి లా పరీక్షలు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో ఎల్ఎల్‌బీ (మూడు సంవత్సరాల కోర్సు) ఆరో సెమిస్టర్, ఎల్ఎల్‌బీ (ఐదు సంవత్సరాల కోర్సు) పదో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 29 నుంచి అక్టోబర్ 4 వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎస్కేయూ డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ ఓ ప్రకటన విడుదల చేశారు.

భార్యపై హత్యాయత్నం



ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

నల్లచెరువు: భార్యపై హత్యాయత్నం చేసిన ఘటన శనివారం నల్లచెరువులో వెలుగు చూసింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎల్లమ్మ వీధిలో నారాయణస్వామి, బాలమణి దంపతులు నివాసముంటున్నారు. ఇటీవల నారాయణస్వామి తాగుడుకు అలవాటుపడ్డాడు. కూలి పనులు చేసి వచ్చిన సంపాదనంతా మద్యానికే ఖర్చు చేసేవాడు. తాగుడు మానుకోవాలని దండిస్తుండటంతో భార్యపై కోపం పెంచుకున్నాడు. ఈ క్రమంలో శనివారం ఇంట్లో పనిచేసుకుంటున్న భార్యను వెనుకనుంచి వచ్చి వీపు భాగంలో కత్తితో పొడిచి పారిపోయాడు. బాలామణి బాధ భరించలేక గట్టిగా కేకలు వేసింది. స్థానికులు వచ్చి ఆమెను కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఫైనల్స్‌కు నెల్లూరు, బీకేఎస్ జట్లు

- నేడు ఫైనల్ మ్యాచ్‌కు ఏర్పాట్లు



ఫైనల్‌కు చేరిన బీకేఎస్ జట్టు

బుక్కరాయసముద్రం: జంతలూరులో రెండు నెలలుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. శనివారం సెమీ ఫైనల్ మ్యాచ్‌లో నెల్లూరు, బళ్లారి జట్లు తలపడ్డాయి. నెల్లూరు జట్టు నిర్ణీత 14 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 185 పరుగులు చేసింది. తరువాత బరిలోకి దిగిన బళ్లారి జట్టు 156 పరుగులకు ఆలౌట్ అయ్యి ఓటమి పాలైంది. దీంతో నెల్లూరు జట్టు ఫైనల్‌కు చేరుకుంది. ఇది ఇలా ఉండగా సెమీ ఫైనల్‌లో జంతలూరు జట్టుపై గెలిచిన బీకేఎస్ జట్టు కూడా ఫైనల్‌కు అర్హత సాధించింది. ఆదివారం నెల్లూరు – బీకేఎస్ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరగనుంది. పోటీల ముగింపు సందర్భంగా నిర్వాహకులు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమానికి ఏర్పాట్లు చేశారు.

పండుగ పూటా పస్తులే

ఉద్యోగుల వివరాలు	
మండల విద్యాశాఖలో డేటా ఎంట్రీ ఆపరేటర్లు	32
ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు	32
మండల లెవల్ అకౌంటెంట్స్	13

- రెండు నెలలుగా అందని వేతనాలు
- ఇబ్బందుల్లో సమగ్ర శిక్ష అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు



భవిత కేంద్రాలలో...	
ఐఈఆర్పీలు	64
ఫిజియో థెరపీలు	10
ఆయాలు	32

ఉన్నత పాఠశాలలో పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు	175
కేజీబీవీ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది	820
జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో సిబ్బంది	10
ఇతర సిబ్బంది	409

పుట్టపర్తి: అధికారంలోకి వస్తే ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తామని, మెరుగైన పీఆర్సీ ప్రకటించి పెండింగ్ బకాయిలు మొత్తం చెల్లిస్తామని సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి పార్టీల నేతలు హామీ ఇచ్చారు. ప్రభుత్వం కొలువుదీరి 16 నెలలు కావస్తున్నా సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించలేదు. ప్రతి నెలా ఒకటో తేదీ దేవుడెరుగు.. 15వ తేదీనాటికి కూడా వేతనాలు పడలేదని, ప్రస్తుతం దసరా పండుగకైనా వేతనాలు పడతాయో లేదో అని వారు దిగాలుగా ఉన్నారు. ఇప్పటికే రెండు నెలల వేతనాలు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. జిల్లాలో సమగ్ర శిక్ష కింద పని చేసే అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు 1,565 మంది ఉన్నారు.

నిరాశే ఎదురవుతోంది



కూటమి ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. అయినా ఎందుకో మాకు వేతనాలు సక్రమంగా అందడం లేదు. ఒకటో తేదీనే జీతాలు పడతాయని ఎదురు చూస్తూ ప్రతిసారీ నిరాశ చెందుతున్నాం. సమయానికి వేతనం రాకుంటే కుటుంబాలు ఎలా నడుస్తాయో ప్రభుత్వం ఆలోచించాలి.

– ఓబిరెడ్డి, సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు, పుట్టపర్తి

ఒకటో తేదీనే వేతనాలు చెల్లించాలి



ప్రతి నెల 1వ తేదీ నాడే తమకు వేతనాలి చెల్లించాలి. వేతనాలు ఆలస్యం కావటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.కుటుంబ సభ్యుల రోజు వారి ఖర్చులు,ఇతర అవసరాలకు అప్పులు చేయాల్సి వస్తోంది.ఇప్పటికైనా ప్రభుత్వం క్రమం తప్పకుండా 1వ తేదీ రోజే వేతనాలు చెల్లించే విధంగా చూడాలి.

– రామన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి, సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ

అప్పులు చేయాల్సి వస్తోంది



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మా కష్టాలు తీరతాయని సంతోషపడ్డాం. ఆ సంతోషం చాలా రోజులు నిలువలేదు. నెలల తరబడి వేతనాలు పడలేదు. పండుగలు, శుభకార్యాలకు అప్పులు చేయాల్సిన పరిస్థితులు దాపురించాయి.

– స్రవంతి, జిల్లా అధ్యక్షురాలు, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్స్ యూనియన్

పండుగ ఎలా చేసుకోవాలి?



ప్రభుత్వం వేతనాలు ఇవ్వకుంటే దసరా పండుగ ఎలా చేసుకోవాలి? రెండు నెలలుగా వేతనాలు రాక చాలా ఇబ్బందులు పడుతున్నాం. అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తున్నాం.

– ఓబిలేసు, సీఆర్ఎంటీ ప్రధాన కార్యదర్శి

త్వరలో చెల్లిస్తాం

సమగ్ర శిక్షలో పనిచేసే అన్ని విభాగాల ఉద్యోగులకు త్వరలోనే వేతనాలు చెల్లిస్తాం. నెలన్నర రోజులకు సంబంధించి వేతనాలు చెల్లించాల్సి ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు ఇందుకు సమకూర్చాల్సి ఉంది.

– దేవరాజ్, సమగ్ర శిక్ష అధికారి

రేపటి కలెక్టరేట్ ధర్నాకు తరలిరండి



పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వీఆర్ఏలు

పుట్టపర్తి అర్బన్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాకు వీఆర్ఏలు తరలిరావాలని వీఆర్ఏల సంఘం పిలుపునిచ్చింది. శనివారం నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన వీఆర్ఏలు పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుని ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వీఆర్ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దన్న, జిల్లా అధ్యక్షుడు గంగాద్రి, కార్యదర్శి పెద్దన్న, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు తదితరులు మాట్లాడారు. చనిపోయిన వీఆర్ఏల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని, నామినీ వీఆర్ఏలను క్రమబద్ధీకరించాలని, అర్హులైన వారికి వీఆర్ఓ, అటెండర్, వాచ్‌మెన్, డ్రైవర్లుగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. వీఆర్ఏలకు పేస్కేల్ అమలు చేయాలన్నారు. ఈ నెల 22న జిల్లాలో వీఆర్ఏలందరూ కలెక్టరేట్ వద్దకు చేరుకొని భారీ ర్యాలీ, ధర్నాను విజయవంతం చేయాలన్నారు. అనంతరం ఆర్డీఓ సువర్ణకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వినోద్, షేక్షావలి, వీఆర్ఏలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గొర్రెలకాపరి దుర్మరణం



హనుమంతప్ప (ఫైల్)

పరిగి: రోడ్డు ప్రమాదంలో గొర్రెలకాపరి దుర్మరణం చెందాడు. ఎస్ఐ రంగడు యాదవ్ తెలిపిన వివరాల మేరకు... మోదా పంచాయతీ పుట్టగూర్లపల్లికి చెందిన బి.హనుమంతప్ప(60) గొర్రెల కాపరిగా ఉంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శుక్రవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వచ్చి మధుగిరి – హిందూపురం ప్రధాన రోడ్డుపై మోదాకు నడుచుకుంటూ వెళ్తుండగా ఎదురుగా వచ్చిన బొలెరో వాహనం ఢీకొట్టింది. రోడ్డు పక్కన పిచ్చి మొక్కల్లోకి ఎగిరిపడిన హనుమంతును కాసేపటి తర్వాత గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే హనుమంతప్ప చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. శనివారం మృతుడి భార్య సిద్దమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యూరియా పక్కదారి పట్టకూడదు



మొక్క నాటుతున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

ధర్మవరం రూరల్/ధర్మవరం అర్బన్: యూరియా పక్కదారి పట్టకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశించారు. శనివారం ఆయన ధర్మవరంలో సుడిగాలి పర్యటన చేశారు. తొలుత పట్టణంలోని శ్రీ బాలాజీ ఫర్టిలైజర్ దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణంలో నిల్వ ఉంచిన యూరియా గురించి ఆరా తీశారు. ఈ సీజన్‌లో ఎంతమేర యూరియా పంపిణీ చేశారని అడిగి తెలుసుకున్నారు. దుకాణంలోని రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. యూరియా పంపిణీలో జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. అలాగే రైతులకు కావాల్సినంత యూరియా పంపిణీ చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ శ్యాం ప్రసాద్ నిమ్మలకుంటలోని ఆయుష్మాన్ భారత్ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఆ సమయంలో కేంద్రంలో 'ఆశ' కార్యకర్త తప్ప ఎవరూ లేకపోవడంతో డాక్టర్ ఎక్కడికి వెళ్లారని ఆరా తీశారు. అలాగే తోలుబొమ్మలాట కళాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత దళవాయి చలపతి ఇంటికి వెళ్లారు. తోలుబొమ్మలను ఆసక్తిగా తిలకించారు. జిల్లా ఖ్యాతిని జాతీయ స్థాయిలో చాటిన దళవాయి చలపతిని కలెక్టర్ అభినందించారు.

కోటి మొక్కలను నాటాలి..

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈ ఏడాదిలో కోటి మొక్కలను నాటడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు కలెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన పట్టణంలోని వైఎస్సార్ కాలనీ వద్ద మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా ప్రతి మూడో శనివారం పరిసరాల పరిశుభ్రతతో పాటు పచ్చదనం పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలన్నారు. పాఠశాలలు, ఇళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, అనుకూలమైన ప్రాంతాల్లో విరివిగా మొక్కలను నాటాలన్నారు. ఎవరైనా చెట్లు నరికితే కేసులు కూడా చేస్తామని హెచ్చరించారు. అంతకుముందు ఆయన.. నెలవారీ తనిఖీల్లో భాగంగా పట్టణంలోని మార్కెట్‌యార్డులో ఈవీఎంలు భద్రపరిచిన గోడౌన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈవీఎంల భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ మహేష్, మున్సిపల్ టీపీఆర్ఓ విజయభాస్కర్, టీపీఓ అలివేలమ్మ, మున్సిపల్ డీఈ వీరేష్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఈశ్వరయ్య, అటవీశాఖ అధికారులు మల్లికార్జున, అక్కులప్ప, పుల్లప్ప, గిరీష్ తదితరులు ఉన్నారు.

నంది కోసం పోలీస్ స్టేషన్ ముట్టడి



పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆందోళన చేస్తున్న ముష్టికోవెల పంచాయతీ ప్రజలు

- రెండు వారాలైనా పట్టించుకోకపోతే ఎలా?
- పోలీసులను ప్రశ్నించిన ప్రజలు

చెన్నేకొత్తపల్లి: పురాతన ఆలయంలో చోరీ అయిన నంది విగ్రహం రికవరీ కోసం ప్రజలు పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించారు. ఈ నెల నాలుగో తేదీన ముష్టికోవెల సమీపంలోని పురాతన శివాలయంలోని నంది విగ్రహం చోరీ అయ్యింది. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి పురోగతీ లేదు. దీంతో విసుగు చెందిన ముష్టికోవెల పంచాయతీ పరిధిలోని సుబ్బరాయనిపల్లి, బురుజుగుట్టపల్లి, గువ్వలగొందిపల్లి గ్రామాల ప్రజలు శనివారం చెన్నేకొత్తపల్లి పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని బైఠాయించారు. చోరీకి సంబంధించి కొంత సమాచారం తెలియజేసినా ఇప్పటి వరకు దొంగలు పట్టుకోకుండా ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. నిర్లక్ష్యం వీడి త్వరితగతిన దొంగలను పట్టుకుని, నంది విగ్రహాన్ని అందించాలని కోరారు.

పోలీసుల అదుపులో అనుమానితులు?

శివాలయంలోని నంది విగ్రహం చోరీ కేసులో ఐదుగురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు తెలిసింది. అయితే పోలీసులు ఈ విషయాన్ని ధ్రువీకరించలేదు. అనుమానితుల్లో ముష్టికోవెలతో పాటు చెన్నంపల్లి గ్రామాలకు చెందిన వారున్నట్లు సమాచారం.

అంతర్జాతీయ శాస్త్రవేత్తల సరసన రత్నగిరి కుర్రాడు

- స్టాన్‌ఫర్డ్ వర్సిటీ వరల్డ్ శాస్త్రవేత్తల జాబితాలో డాక్టర్ మంజునాథ్‌కు చోటు



శాస్త్రవేత్త డాక్టర్ కె.మంజునాథ్

రొళ్ల: అంతర్జాతీయంగా పేరుగాంచిన శాస్త్రవేత్తల సరసన రత్నగిరి గ్రామానికి చెందిన యువకుడు డాక్టర్ కె.మంజునాథ్ చోటు దక్కించుకున్నారు. ఇటీవల అమెరికాకు చెందిన స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రపంచ స్థాయి గొప్ప శాస్త్రవేత్తల టాప్–2 శాతం పర్సెంటేజ్ జాబితా విడుదల చేయగా.. అందులో మంజునాథ్‌కు కూడా చోటు దక్కడం గమనార్హం.

నిరుపేద కుటుంబంలో పుట్టి...

రొళ్ల మండలం రత్నగిరి గ్రామానికి చెందిన జి.కృష్ణప్ప, తిప్పమ్మ దంపతుల కుమారుడైన డాక్టర్ కె.మంజునాథ్ బాల్యమంతా స్వగ్రామంలోనే సాగింది. నిరుపేద కుటుంబంలో పుట్టిన ఆయన చదువుతో జీవితాలు మారుతాయని భావించారు. ఈ క్రమంలోనే ఎమ్మెస్సీ పూర్తి చేసి బెంగళూరులోని 'ది ప్రెసిడెన్సి యూనివర్సిటీ'లో చేరి 'సింథసిస్ అండ్ స్టడీ ఆఫ్ స్ట్రక్చరల్, ఎలక్ట్రికల్ అండ్ మాగ్నెటిక్ ప్రాపర్టీస్ ఆఫ్ ట్రాన్సిషన్ మెటల్ డోప్డ్ నానోపార్టికల్స్' అనే అంశం పై పీహెచ్‌డీ పూర్తి చేసి పట్టా అందుకున్నారు. తైవాన్‌లోని నేషనల్ డాంగ్‌హ్వా యూనివర్సిటీలో పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ ఎంపికైన ఆయన... ప్రస్తుతం అక్కడే విశిష్ట పరిశోధనలు కొనసాగిస్తున్నారు. భౌతికశాస్త్రంలో డాక్టర్ మంజునాథ్ చేసిన అత్యుత్తమ పరిశోధనలు గుర్తిస్తూ స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం వరల్డ్ టాప్–2 పర్సెంటేజ్ శాస్త్రవేత్తల జాబితాలో చేర్చింది. దీంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు, గ్రామస్తులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పని చేయండి



పోస్టింగ్స్ అందుకున్న ఎంపీడీఓలతో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: 'మీకొచ్చిన అవకాశాన్ని గొప్ప వరంగా భావించండి. అభివృద్ధి, పేదల సంక్షేమమే లక్ష్యంగా పని చేయండి. విధి నిర్వహణలో మీ సమర్థతను నిరూపించుకొని, జిల్లా పరిషత్ ప్రతిష్టను పెంపొందించండి' అంటూ జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ సూచించారు. డిప్యూటీ ఎంపీడీఓ స్థాయి నుంచి ఎంపీడీఓలుగా పదోన్నతి పొందిన ఆరుగురికి మండలాలు కేటాయిస్తూ శనివారం ఉత్తర్వులు అందజేశారు. జెడ్పీ కార్యాలయంలో గల తన చాంబర్‌లో పదోన్నతి పొందిన ఎం.శకుంతల(ముదిగుబ్బ), ఎస్.కమలాబాయి(గోరంట్ల), ఎస్.మాధవి(కుందుర్పి), వి.జయరాములు (గుమ్మఘట్ట), జి.శ్రీనివాసులు (అమడగూరు), జి.ఆనంద్ ప్రసాద్‌ను రొద్దం ఎంపీడీఓగా నియమిస్తూ ఉత్తర్వులు అందించి, శుభాకాంక్షలు తెలిపిన అనంతరం ఆమె కర్తవ్య బోధ చేశారు. కార్యక్రమంలో సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ జీవీ సుబ్బయ్య, ఏఓలు షబ్బీర్ నియాజ్, విజయభాస్కర్‌రెడ్డి, రత్నాబాయి పాల్గొన్నారు.

ఆన్‌లైన్ గేమ్ విషయంలో ఘర్షణ

రొద్దం: మండల కేంద్రం రొద్దంలో ఆన్‌లైన్ గేమ్ విషయమై కార్పెంటర్ కలీమ్, నాగార్జున అనే యువకుల మధ్య శనివారం ఘర్షణ చోటు చేసుకుంది. అనంతరం ఇరువురి ఇళ్లలో విషయం తెలిసింది. దీంతో ఇరువర్గాల వారు పరస్పర దాడులు చేసుకున్నారు. గాయపడిన కలీమ్, నాగార్జునను పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు.

ఇద్దరు పిల్లలను చంపి.. తల్లి ఆత్మహత్య



కుమారుడు పుష్విక్‌తో సరిత (ఫైల్)



కుమార్తె యుక్తి (ఫైల్)



తల్లీ పిల్లల మృతదేహాలు

- కడపలచెరువులో ఘోరం
- భర్త, అత్త వేధింపులతోనే ఘాతుకం!

పావగడ: పావగడ తాలూకాలో ఘోరం జరిగింది. ఓ తల్లి తన ఇద్దరు పిల్లలను చంపి.. ఆపై తానూ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన కలకలం రేపింది. వివరాలిలా ఉన్నాయి. కడపలచెరువు గ్రామంలో సరిత (23), ఆటోడ్రైవర్ సంతోష్‌కుమార్ దంపతులు నివాసముంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు సంతానం. ఉన్నంతలో జీవనం సాఫీగా సాగిపోతుండేది. ఏమైందో ఏమో కానీ శనివారం మధ్యాహ్నం సరిత కుమారుడు పుష్విక్ (4) గొంతు కోసి, ఏడాదిన్నర వయసు గల కుమార్తె యుక్తిని ఉరేసి చంపి.. ఆ తర్వాత తానూ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భర్త సతీష్‌కుమార్, అత్త అంజమ్మల వేధింపులు తాళలేక సరిత ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటుందని బంధువులు ఆరోపిస్తున్నారు. మధుగిరి డీఎస్పీ మంజునాథ్, రూరల్ సీఐ గిరీశ్, పట్టణ సీఐ సురేశ్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

24 మండలాల్లో వర్షం



చిత్రావతిలో కొనసాగుతున్న ప్రవాహం



కోవెలగుట్టపల్లి బ్రిడ్జిపై ప్రవహిస్తున్న చిత్రావతి నది

- చిత్రావతికి కొనసాగుతున్న ప్రవాహం

పుట్టపర్తి అర్బన్: ద్రోణి ప్రభావంతో జిలాల్లోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకూ 24 మండలాల పరిధిలో 343.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అత్యధికంగా ముదిగుబ్బ మండలంలో 42.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు. ఇక ఎగువన కురుస్తున్న వర్షాలతో చిత్రావతి నదిలో ప్రవాహం కొనసాగుతోంది. దీంతో బుక్కపట్నం చెరువుకు వరద పోటెత్తుతోంది. త్వరలోనే చెరువు పూర్తి స్థాయిలో నిండనున్నట్లు తెలుస్తోంది.



తెగిపోయిన రాయలవారిపల్లి బ్రిడ్జ్‌ను పరిశీలిస్తున్న ప్రజలు

నిలిచిన రాకపోకలు

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి వద్ద చిత్రావతి నది భారీగా ప్రవహించడంతో రాయలవారిపల్లి, కోవెలగుట్టపల్లి వద్ద వరద పోటెత్తింది. ఫలితంగా కాజ్‌వే బ్రిడ్జి తెగిపోవడంతో గ్రామాలకు రాక పోకలు నిలిచి పోయాయి.